# అంతరార్థం

వే డి వేడిగా వున్న 'టీ'ని వూదుకుంటూ త్రాగుతున్నాడు కూర్మారావు.

"మీ అమ్మని యిక్కడికి తీసుకొచ్చీ మావాఁ" మెల్లగా అంది కూనమ్మ.

భార్య యిలా అనడం, ఒక్కసారి ఆశ్చర్యం కలిగించింది కూర్మారావుకి. ఆమెకేసి అదోలా చూశాడు. "తాను కలగనడం లేదు కదా...?" అనుకున్నాడు క్షణంపాటు. కలకాదని, తాగుతున్న వేడి 'టీ' గుర్తు చేసింది.

కూర్మారావు అంతగా ఆశ్చర్యపోడానికి కారణం లేకపోలేదు. ఇప్పటికి అయిదేళ్ళయ్యింది - తానీ వూరొచ్చి... తనకి పెళ్ళయి; ఒక్కరోజు కూడా అత్త విషయం కూనమ్మ ప్రస్తావించలేదు సరికదా, యెప్పుడైనా ఆమె ప్రస్తావన వస్తే ఛర్రున ఒంటికాలు మీద లేచేది. అటువంటి కూనమ్మ, అత్తని తీసుకురమ్మని చెప్తూ వుండటం, ఆశ్చర్యం కలిగించక మరేమవుతుంది?

"ఏటే కూనా, యియ్యాల అర్థంతరంగా నీలో మారుపొచ్చేసిందేటి? ఆఁ..." అన్నాడు సూటిగా ఆమె మొహంలోకి చూసి

"నీకు యేలాకోలంగా వుంటాదిగాని, నాను సెప్పినట్లు సెయ్యి మావాఁ! నానేం సెప్పినా,యేం సేసినా, దానికేదో అర్థం ముంటాది..." కాస్త విసుగ్గా అంది కూనమ్మ.

కూర్మారావు, టీ త్రాగడం ముగించి, గ్లాసుని పెళ్ళాం చేతికందించాడు.

"అసలిసయం యేటో నాతో సెప్పకూడదేటి? ఇన్ని రోజులూ మా అమ్మమీద లేని పేమ, యిప్పుడొచ్చేసినాదేటి?" అన్నాడు.

కూనమ్మ, మొహం చిట్లించుకుంది. మొగుడెప్పుడూ యిలా నిలదీసి అడిగిన రోజు యింతవరకూ లేదు. ఈ రోజేవింటి చెప్మా యిలా అడుగుతున్నాడు?... అని మనసులో అనుకుంది.

"అబ్బబ్బ ! నీతో యితే సిక్కు మావాఁ.. అన్నింటికీ ఆరాలు తీస్తావు. నానేం సేసినా, మన మంచికి, మన పిల్లల మంచికే సేత్తాను కదా" విసుగ్గా అంది.

"ఏటే ఆ మంచి? నాను తెల్సుకోకూడదేటి?"

"మీ అమ్మ బాగా డబ్బు యెనకేసిఁదట! వడ్డీలకి అప్పులిస్తందట కూడా ఆమెని మనం తీసుకొచ్చి కొద్దిరోజులాదరించినామనకో, లోకమూ మెచ్చుకుంటుంది.. మీ అమ్మ మురిసిపోద్ది, ఆమెని మెప్పించి, మనసు మార్చి, ఆమె దగ్గరున్న డబ్బు చేజిక్కించుకున్నావనుకో! చక్కా ఓ దుకాణం పెట్టుకోవచ్చు. దాంతో మనం పెద్దోలైపోవచ్చు. మన అదురుస్తవేఁ మారిపోద్ది" అంటూ తన మనసులోని మాట చెప్పింది కూనమ్మ.

పెళ్ళాం ఆలోచన బాగా నచ్చింది కూర్మారావుకి...

"అదా సంగతి? నీ బుర్ర మా గొప్ప పదునైందే కూనమ్మా సరే! ఎల్లి తీసుకొత్తాలే" అన్నాడు.

కూనమ్మ తృప్తిగా ముసిముసిగా నవ్వుకుంది. ఆమె మెదడుల్లో యేవేవో ఆలోచనలు అప్పుడే స్వైర విహారం చేస్తున్నయ్.

✪ ✪ ✪

కూర్మారావు తల్లి ఎరకమ్మ. ఎరకమ్మ మొగుడు చపిపోయేసరికి కూర్మారావు వయస్సు సుమారు పదిహేనేళ్ళు. వాణ్ణి ఎరకమ్మ, ఆ యింటా, యీ ఇంటా అంట్లు తోముకుని పెద్దవాణ్ణి చేసింది. ఆమె పన్జేస్తుండే ఓ ఇంటి యజమాని ధర్మమా అంటూ, కూర్మారావుకి పక్క వూరి ఫ్యాక్టరీలో ఓ చిన్న ఉద్యోగం దొరికింది. ఉద్యోగం దొరగ్గానే, వాణ్ణో ఇంటి వాణ్ణి చేసెయ్యాలనుకుంది ఎంకమ్మ. ఆ మరుసటి సంవత్సరమే కొడుక్కి పెళ్ళి చేసింది.

కూనమ్మ సంసారానికి వచ్చిన తక్షణం ఆ ఇంటి వాతావరణమే మారిపోయింది. ఎరకమ్మని దూరంగానేవుంచింది. 'నా' అనే భావం, ఆమెలో బాగా జీర్ణించుకుపోయింది. ఫలితంగా, ఫ్యాక్టరీ వున్న వూళ్ళోనే కాపురం పెట్టింది. ఎరకమ్మ గురించి ఆమెకి ఆలోచనలే లేవు. ఆమె వున్న చోటనే వుండాలని తీర్మానించింది.

అనుకోని ఈ పరిణామానికి, ఎరకమ్మ నివారంచలేదు. కొడుకూ, కోడలు సుఖంగా జీవితాన్ని గడపడమే ఆమె కాంక్షించింది.

ఎరకమ్మ, యెప్పటిలానే అంట్లు తోముకుని, జీవితాన్ని గడుపుకొస్తుంది. తన పొట్ట పోషించుకోవడం, ఆమె కెప్పుడూ సమస్య కాలేదు. అయితే యెటొచ్చీ కొడుకూ, కోడలు తనకళ్ళ ముందు లేరనే బాధ మాత్రం ఆమెని అప్పుడప్పుడూ కలవరపరుస్తూ వుండేది.

✪ ✪ ✪

కొడుకు వచ్చి, తనతో పాటు వచ్చేయమని ఆహ్వానించడం, ఎరకమ్మకి నిజంగా ఆశ్చర్యమే

కలిగింది "ఇన్నాళ్ళూ... లేనిది హటాత్తుగా కొడుకూ, కోడలులో యీ ఆప్యాయత యెలా ఉట్టిపడిందీ' అన్నదే అర్థం కాని విషయమయింది.

"మీరు కులాసాగా వుంటే, అంతే సాలురా అయ్యా! నా నక్కడికి రావాలేటి సెప్పు ! ఇక్కడ నాకు బాగానే వుందిగా!" అంది ఎరకమ్మ.

"అదంతా నాకు తెలవదు. మీ కోడలు నిన్ను తీసుకొచ్చేయమంది అంతే! మారాం చేసినట్టుగా' అన్నాడు కూర్మారావు

"దానికి నా మీద అంత పేమ పుట్టేసిందేఁటా?" అంది ఎరకమ్మ, అదోలా కొడుక్కేసి చూస్తూ

కూర్మారావు లోలోన గతుక్కుమన్నా, వెంటనే సర్దుకున్నాడు.

"అదేం మాటే అమ్మా? నువ్వంటే దానికి వల్లమాలిన అభిమానఁవేనే... ఎటొచ్చీ నాను సంపాదిత్తంది, అందరికీ సాల్దని, ఇన్నాళ్ళూ పిల్లేదు మరింక నువ్వేమీ అడ్డు సెప్పకండా బైలుదేరుమీ...' అన్నాడు కూర్మారావు, ఇంక వాదోపవాదాలు అనసరమన్నట్టు.

కొడుకు అంత దీనిగా చెప్తుంటే, తాను వెళ్ళకపోవడం, బాగుండదనిపించింది ఎరకమ్మకి. తాను కొడుకు దగ్గరి కెళ్ళిపోతున్నట్టు అందరికీ చెప్పింది. యెంతో ఉత్సాహంతో ; వాళ్ళూ ఆనందించారు. కొడుకు దగ్గరికి తల్లి వెళ్ళిపోతూంటే, ఆనందించరూ మరి; అది తెగని బంధం ! కొడుకుతో పాటు బయలుదేరింది ఎరకమ్మ.

✪ ✪ ✪

కూనమ్మ అత్తని చూడంగానే వుట్టిపడుతూన్న ఆప్యాయతతో, ముందుకొచ్చి ఆహ్వానించింది తన కోడలు బాగా మారిపోయిందనుకున్న ఎరకమ్మ తృప్తిగా నవ్వుకుంది.

"బాగున్నావే కూనా" కుశల ప్రశ్న వేసింది ఎరకమ్మ.

"ఏదో యిట్లా వున్నాం అత్తమ్మా ! నువ్వు మా దగ్గర నేకపోతే యేటోలా వుంటుంది. అందుకే మీ అబ్బాయికి సెప్పినాను, నిన్న వెంటనే తీసుకొచ్చీమని..." అంటూ పీట తెచ్చివేసింది కూచోమన్నట్టు.

ఎరకమ్మ కూచుంది కూర్మారావు తల్లి పెట్టెని లోపల పెట్టేశాడు.

"ఇడిగోనే నీ మనవఁడు.." అంటూ చాపమీదున్న కొడుకుని తెచ్చి తల్లికి అందించాడు కూర్మారావు.

ఎరకమ్మ వాత్సల్యపూరితంగా మనవణ్ణి యెత్తుకుని, ముద్దుల వర్షం కురిపించింది.

"ఒరే కూర్మం నువ్వు తెచ్చి చూపించకపోయినా, యీణ్ణి సూడ్డానికి నానే వచ్చేసినాన్రా!" అంది నిష్టూరంగా

కూర్మారావు మరేం మాట్లాడలేదు నిజమే - యేం చెప్పగలడు?

"లెగత్తమ్మా అన్నం తిందువుగాని..." అంది కూనమ్మ

"తొందరేటి లేయే... అందరం ఒక్క సుట్టే తిందాం..." అనేసి మనవణ్ణి ఆడిస్తూ కూచుంది ఎరకమ్మ.

కూర్మారావు వీధిలోకి వెళ్ళాడు.

✪ ✪ ✪

వారం రోజులు గడిచాయి.

ఓ రోజు రాత్రి భోజనాలయ్యాక ఎరకమ్మ, కూర్మారావు, కూనమ్మ బైట మంచం వేసుక్కూచున్నారు.

వాతావరణం నిశ్శబ్దంగా వుంది

"సెప్పు మావాఁ..." అంది కూనమ్మ

"నువ్వే సెప్పు..." కూర్మారావు అన్నాడు.

" ఏట్రా అది.. ?" కొడుక్కేసి చూస్తూ అడిగింది, ఎరకమ్మ.

మొగుడు సరిగ్గా చెప్పలేడని, తనే అందుకొంది కూనమ్మ.

" ఏం లేదత్తమ్మా ! మరేటంటే, మీ అబ్బాయి యేదేనా దుకాణం పెడతానంటన్నాడు. తెచ్చుకున్న జీతపురాళ్ళు సాల్డంలేదు. రోజులు మండిపోతున్నాయి గదా ! ఓ సిన్న 'టీ' దుకాణం పెట్టుకోవాలన్నా డబ్బుండాలి నువ్వో అయిదొందలు సాయం చేసినావంటే, కొన్నాళ్ళుపోయాక, యిచ్చేత్తాం" అసలు విషయం వెల్లగక్కింది కూనమ్మ.

"ఔనమ్మా ! నీ డబ్బు పువ్వుల్లో పెట్టి యిచ్చేత్తామే" భార్య మాటలకి తాళం వేశాడు కూర్మారావు.

ఎరకమ్మ విస్తుపోయింది. ఆ చీకట్లో ఆమె ముఖ కవళికలు యెవ్వరూ గమనించలేదు గాని, ఆ ముహంలో రంగులు మారినయ్. తన దగ్గర డబ్బెక్కడిది? అసలు తన దగ్గర డబ్బుందని యెవరు చెప్పారు ?... అనుకుంది మనసులో ఇప్పుడామెకి అర్థమయ్యింది. తనని తీసుకురావడానికి గల కారణం యేమిటో... తనంటే యింత అభిమానాన్ని యెందుకు ఒలకబోస్తున్నారో... నిజంగా ఆమెకెంతో బాధ కలిగింది.

"నా దగ్గర డబ్బుందని యెవరు సెప్పినారు? అదీ అయిదొందలా? అయిదు రూపాయిల్లేవు.. అయినా, నాకెట్లా వస్తుంది డబ్బు సెప్పు? పదిళ్ళలో పనిసేసుకుంటున్నా గాబట్టి, పస్తుండకుండా గడిపేత్తన్నాను. కావాలంటే, నా పెట్టే సూసుకో" అంది ఎరకమ్మ, కనుబొమ్మలు ముడుస్తూ.

కూనమ్మ మొహం యఱ్ఱబడ్డది, ఎరకమ్మగాని, కూర్మారావు గాని ఆ చీకట్లో చూళ్లేదు. "అందరూ

చెప్తుంటే, ఔనేమో నన్కున్నా... అయినా, నువ్వెందుకిత్తావులే మాకు..' అనుకుని చిరబురలాడుతూ లోపలికి వెళ్ళిపోయింది కూనమ్మ.

కొంపేదో మునిగిపోయినట్టుగా, కంగారుగా పెళ్ళాం వెంట నడిచాడు కూర్మారావు.

ఆ రాత్రి, ఎరకమ్మ అరుబైటే పడుకుంది. మనుషుల తత్వాలకి, డబ్బుకీ యెంత అవినాభావ సంబంధముందో అప్పుడర్థం చేసుకుందామె.

✪ ✪ ✪

తెల్లవారింది.

ఎరకమ్మని పురుగును చూసినట్టు చూడ్డం ప్రారంభించింది కూనమ్మ.

కూర్మారావు సంగతి చెప్పనవసరం లేదు. పెళ్ళాం చేతిలో కీలుబొమ్మ ఏం చెయ్యగలడు ? ఇరిక, ఇక్కడ ఒక్కక్షణం వుండబుద్ధి పుట్టలేదు ఎరకమ్మకి

"ఒరయ్యా ! నావెళ్ళిపోతాన్రా" అంది కొడుకుతో.

"మధ్యాహ్నం పన్నెండింటికి బస్సుంది... ఎల్లిపో" అన్నాడు కూర్మారావు, కూనమ్మ వుండమనేం చెప్పలేదు.

ఎరకమ్మ, బరువుగా ఓ నిట్టూర్పు విడిచింది తాను డబ్బు తీసుకురాకపోవడం మంచిదే అయింది లేకుంటే, రెంటికీ చెడ్డ రేవడిలా తిరిగి వెళ్ళాల్సి వచ్చును... తాను గుడిసె వేసుకున్న యింటావిడ చెప్పిందే నిజమయింది.. అనుకుంది మనసులోనే.

"వస్తాన్రా! కూనా... వస్తానే..." అని యిద్దరికీ చెప్పింది.

"ఎల్లిరా..." అని కూర్మారావు అన్నాడు. గాని, కూనమ్మ మౌనంగా వుండిపోయింది.

"చంటోడికి మంచి జుబ్బా యేదన్నా తీసుకురా" అంటూ బొడ్లోంచి సంచి తీసి అందులోంచి పాతిక రూపాయలు తీసి కొడుక్కిచ్చింది.

ఆ మధ్యాహ్నం బస్సుకే వెళ్ళిపోయింది ఎరకమ్మ. కొడుకు కోడలు తన పట్ల చూపిన ప్రవర్తనకి ఆమె హృదయం గాయపడింది. అయినా, యేం చెయ్యగలదు ? నలుగురికీ చెప్పుకోలేదు. మనసులోనే మధనపడింది తల్లి !

□□□

(ఆంధ్రసచిత్ర వార పత్రిక 11.6.82)